క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థి ఎంపిక



ప్రదీప్‌ను అభినందిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

మాకవరపాలెం: ఎన్‌ఎంఎంఎస్‌కు దాలింపేట విద్యార్థి ఎంపికయ్యాడు. 2023–24 విద్యా సంవత్సరానికి నిర్వహించిన అర్హత పరీక్షలో దాలింపేట ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న చొప్ప నాగప్రదీప్ ఎంపికయ్యాడని ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం సదరు విద్యార్థిని ఆయనతోపాటు మరో ఎంఈవో జస్‌ప్రసాద్, హెచ్‌ఎం సీతానాగమల్లేశ్వరి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లోవరాజు, తల్లిదండ్రులు అభినందించారు.

నేడు వాసవీమాత ఆలయ వార్షికోత్సవం

మాడుగుల రూరల్: మండలంలో జంపెనలో వాసవీమాత ఆలయ ఆరో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు కింతలి గాదిరాయి వాసవీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆలయ కమిటీ చైర్మన్ పుట్టా మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కింతలి – గాదిరాయి వాసవీ సంఘ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారికి ఉదయం కుంకుమార్చన, క్షీరాభిషేకం నిర్వహిస్తామన్నారు. మాడుగుల నియోజకవర్గంలో ఆర్యవైశ్యులు హాజరు కావాలని కోరారు. ఆలయం వద్ద చిన్నారులకు ఆటల పోటీలు, మహిళలకు పాటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పిస్తామన్నారు.

ముగిసిన ఎన్నికల కోడ్

నర్సీపట్నం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం 5 గంటలతో ఎన్నికల కోడ్ ఎత్తివేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెచ్.వి.జయరాం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో విజేతల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ప్రకటించింది. దీనిలో భాగంగా నర్సీపట్నం నియోజకవర్గం నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఎమ్మెల్యేగా గెలుపొందినట్టు గెజిట్ నోటిఫికేషన్ ఆవిష్కరించారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీరాములు పాల్గొన్నారు.

చురుగ్గా కెనాల్‌లో నాచు, మొక్కల తొలగింపు



కొరువాడ మార్గంలో నాచు, మొక్కలను తొలగించే పనుల్లో లస్కర్లు

కె.కోటపాడు: రైవాడ కెనాల్ మార్గంలో నాచు, మొక్కలను తొలగించే పనులను జీవీఎంసీకి చెందిన లస్కర్లు చేపట్టారు. కొరువాడ నుంచి ఉగ్గినవలస కెనాల్ మార్గంలో ఈ పనులను గురువారం నిర్వహించారు. కెనాల్ మార్గంలో నాచు, మొక్కలు నీటి అడుగు భాగంలో పెద్ద ఎత్తున పెరగడం వల్ల ప్రవాహ వేగం మందిగిస్తోంది. విశాఖ జీవీఎంసీకి సరఫరా కావాల్సిన 50 క్యూసెక్కుల నీటి ప్రవాహంలో అంతరాయం కలగకుండా నాచు, మొక్కలను తొలగించే పనులు చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 123 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,380	5,050
రెండో రకం	3,980	4,500
మూడోరకం	3,500	4,060

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–10 యూనిట్లు, బీ పాజిటివ్–15 యూనిట్లు, ఓ పాజిటివ్–6 యూనిట్లు, ఏబీ పాజిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

పింఛన్ సొమ్ము కోసం తప్పని కష్టాలు

బ్యాంక్‌ల వద్ద గంటల కొద్దీ అవ్వాతాతల పడిగాపులు



దేవరాపల్లి ఎస్‌బీఐ బీసీ పాయింట్ వద్ద పింఛన్ సొమ్ము కోసం నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు

దేవరాపల్లి: ప్రతి నెలా వలంటీర్ ద్వారా అందించిన అవ్వాతాతల పింఛన్ సొమ్మును ఈ నెల కూడా బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడంతో వారంతా నానా అవస్థలు పడుతున్నారు. పింఛన్ సొమ్ము కోసం బ్యాంక్‌ల వద్ద గంటల కొద్దీ నిరీక్షణ చేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బీసీ పాయింట్, యూకో బ్యాంక్‌లతోపాటు వివిధ బ్యాంక్‌ల బీసీ పాయింట్‌ల వద్ద అవ్వాతాతలు పడిగాపులు కాశారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి సుదూర గ్రామాల నుంచి వృద్ధులు కుటుంబ సభ్యుల సహాయంతో బ్యాంక్‌ల వద్దకు చేరుకున్నారు. బ్యాంక్‌ల వద్ద పడిగాపులు కాయడంతో పాటు రానుపోను 200 రూపాయలు ఆటో ఛార్జీలకు ముట్ట చెప్పాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తమకు సూర్యోదయం కాకముందే పింఛన్ సొమ్ము అందించేవారని, ఇప్పుడు ఇలా బ్యాంక్‌లు చుట్టూ తమను తిప్పి ఇబ్బందలకు గురిచేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి గతంలో మాదిరిగా ఇంటి వద్దే పింఛన్ సొమ్ము అందించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం



చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో చేరడానికి ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరం బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులలో చేరగోరే విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తులను చేసుకోవాలన్నారు. కళాశాలలో బీఏ ఎకనామిక్స్ ఆనర్స్ కోర్సులో 60 సీట్లు, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 60 సీట్లు, బీఎస్సీ జువాలజీలో ఆనర్స్ కోర్సు 40 సీట్లు, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులో 40 సీట్లు, బీఎస్సీ ఫిజిక్స్ ఆనర్స్ కోర్సులో 40 సీట్లు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి ఓఏఎండీసీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. పై కోర్సులకు సంబంధించి అర్హులైన ఫ్యాకల్టీ, అన్ని సదుపాయాలు ఉన్నాయని, చక్కని విద్యా బోధన అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలో చేరాల్సిందిగా కోరారు. డిగ్రీ విద్యార్థులకు ఈ నెల 14 నుంచి నాల్గో సెమిస్టర్ పరీక్షలు, మధ్యాహ్న సమయంలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

నూకాంబికకు చీరల అలంకరణ



చీరలతో భక్తులకు దర్శనం ఇస్తున్న తాకాశివీధి నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి: స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారిని అమావాస్య పురస్కరించుకుని భక్తులు సమర్పించిన 101 చీరలతో గురువారం అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీధి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్, లెమన్ స్పూన్ పోటీలు



దేవరాపల్లి: క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాసరావు



రోలుగుంట: లెమన్ స్పూన్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

దేవరాపల్లి: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన జె. భవాని, ఎ. ప్రవల్లిక, యు. నిహారిక, ఎ. గుణవర్షిణి, వై. సౌజన్య, ఎం. మోక్షిత, యు. లిల్లీ, ఎ. మధు చరణ్‌లకు లైబ్రేరియన్ ఓ. శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. శుక్రవారంతో వేసవి విజ్ఞాన శిబిరాలు ముగిస్తాయని, వీటిని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన వారందరికీ గ్రంథాలయ అధికారి కృతజ్ఞతలు తెలియజేశారు. క్విజ్ మాస్టర్‌గా చొక్కాకుల ప్రభాకర్ వ్యవహరించారు.

రోలుగుంట: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో లెమన్ స్పూన్, నీతికథల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఆసక్తితో పాల్గొని తమ ప్రతిభ చూపారు. గ్రంథాలయంలో కొనసాగుతున్న ఈ శిబిరంలో విద్యార్థులు పాల్గొని చదువుట, రాయుట, స్పోకెన్ ఇంగ్లిష్, చెస్ తదితర అంశాల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికారి ఎస్. వరలక్ష్మి కోరారు.

మన్యంలో పనస సిరులు

- మార్కెట్‌లో గిరాకీ
- ఆశాజనకంగా ధరలు
- ఆనందంలో రైతులు



.వాహనంలో మైదాన ప్రాంతానికి తరలిస్తున్న పనసకాయలు



గిరిజనులు విక్రయించటానికి తీసుకొచ్చిన పనసకాయలు

జి.మాడుగుల: అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఈ ఏడాది పనసకాయల దిగుబడి బాగుంది. ఆశించిన స్థాయి కంటే ఎక్కువగా ఉందని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా పనసకాయలకు కొనుగోలుకు గ్రామాల్లోను, వారపు సంతల్లో వ్యాపారులు ఎగబడుతున్నారు. గిరిజనులు తమ పంట భూముల్లోను, అటవీ ప్రాంతాల్లో ప్రతీ ఏటా పనసచెట్లు నుండి అధిక సంఖ్యలో పనసకాయలు పంట దిగుబడి లభిస్తుంది. ఏజెన్సీ పనసకాయలు, పనస పండ్లకు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి పనస చాలా రుచికరంగా, మధురంగా ఉండడంతో గిరాకీ ఉంది. దీంతో ఇతరత్రా ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. దీంతో గిరిజన గ్రామాల్లోను, వారపు సంతలకు గిరిజనులు తీసుకొచ్చిన పనసకాయలు హాట్‌కేక్‌ల్లా అమ్ముడైపోతున్నాయి. కొంతమంది రైతులు చింతపల్లి మండలం చిత్రలగొప్పు తదితర ప్రాంతాలకు ఆటోలు, జీపులు, వ్యాన్‌లలో తరలిస్తున్నారు. విశాఖపట్నం, నర్సీపట్నం, విజయనగరం తదితర ప్రాంతాల నుంచి వస్తున్న వ్యాపారులకు విక్రయిస్తున్నారు. మంచి ధరలు పలుకుతుండడంతో గిరిజన రైతులు అధిక ఆదాయం పొందుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో పనసకాయలు సీజన్ వల్ల ప్రస్తుతం డిమాండ్‌తో పాటు ధరలు పలుకుతున్నాయి.ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా కజ్జా, కొబరి, బురద పేర్లుతో పనసకాయలు పండుతున్నాయి. కజ్జా, కొబరి రకాల పనసకాయలు సుమారు 10కిలోలు బరువు ఉంటుంది.. ప్రస్తుతం వీటి ధరలు రూ.100 నుంచి రూ.200ల వరకు పలుకుతున్నాయి. పాడేరు నియోజకవర్గంలోని కొయ్యూరు, గూడెం కొత్తవీధి, చింతపల్లి, జి.మాడుగుల, పాడేరు మండల్లాల్లో 3000 హెక్టార్లకు పైగా విస్తీర్ణం పనసతోటలు ఉండగా ఎకరా భూమిలో 50 నుంచి 70 చెట్లు చొప్పున 3 లక్షల నుంచి 3.50 లక్షలకు పైగా పనసచెట్లు ఉన్నట్లు అంచనా. మండలానికి 1000 నుంచి 1500మంది చొప్పున సుమారు 6000 మందికి పైగా పనస రైతులు ఉన్నట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. మార్కెట్‌ను బట్టి ప్రస్తుత సీజన్‌లో రూ.3వేల నుంచి రూ.6వేలకు పైగా వరకు ఆదాయం వస్తోందని పలువురు రైతులు చెబుతున్నారు. పనసకాయల సాగుకు ఎటువంటి వ్యవసాయ ఖర్చులు లేకుండా ప్రతీ సంవత్సరం వచ్చే ఆదాయంతో కుటుంబ ఖర్చులకు కొంత సరిపోతుందని పలువురు రైతులు చెబుతున్నారు.



.గడుతూరు గ్రామంలో విరగ్గాసిన పనసచెట్టు

గిట్టుబాటు ధరలు



పనసకాయలకు గిట్టుబాటు ధర లభిస్తుంది. ఈ ఏడాది పనసకాయలు దిగుబడి వచ్చింది. కాయల సైజును బట్టి ధర రూ.150 రూ.200లకు పలుకుతుంది. వ్యాపారులు గ్రామాల్లోను, వారపు సంతలకు వచ్చి పనసకాయలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆశించిన ధరలున్నారు. రానున్న రోజుల్లో మార్కెట్ పెరిగి మరింత ధరలు వచ్చే అవకాశాలున్నాయి.

– చిన్నమత్స్యకొండబాబు, రైతు, గడుతూరు గ్రామం, జి.మాడుగుల మండలం

చిరస్మరణీయుడు చండ్ర



చండ్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాజాన దొరబాబు

అనకాపల్లి: స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ నేత చండ్ర రాజేశ్వరరావు 110వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చండ్ర చిత్రపటానికి పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లాకు చెందిన జమీందారీ కుటుంబంలో జన్మించిన చండ్ర, తన వందల ఎకరాల భూముల్ని పేదలకు ఉచితంగా పంచి పెట్టిన త్యాగశీలి అని కొనియాడారు. పేదల పక్షాన నిలిచి, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించారన్నారు. పేదల పక్షాన పోరాటం చేయడమే సీపీఐ కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, నాయకులు సత్యనారాయణ, సత్తిబాబు, పోతురాజు, రమణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య సూచనలు తప్పనిసరి



వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారి సాయికిరణ్

కె.కోటపాడు: గర్భిణులు వైద్య సిబ్బంది వివరించే ఆరోగ్య జాగ్రత్తలను పాటించడం ముఖ్యమని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిరణ్ తెలిపారు. గురువారం ఎ.కోడూరులో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం నిర్వహించారు. 137 మందికి సాధారణ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. రక్తహీనత సమస్య బారిన గర్భిణులు పడకుండా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని వివరించారు. ఆకుకూరలు, పప్పు దినుసులతో కూడిన ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలను చేయించుకోవడం వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యం క్షేమదాయకమని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఏఎన్‌ఎం సంతోషి పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం భాగంగా ఎ. వీరనారాయణంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 93 మందికి వైద్య సేవలందించారు. కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.ఎం.నాయుడు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీతోపాటు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన బోధనతో ఉత్తమ ఫలితాలు



స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థిని ఉషను అభినందిస్తున్న హెచ్‌ఎం స్వర్ణలత



ఎ.కొత్తపల్లిలో అడ్మిషన్ క్యాంపెయిన్ ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్‌ఎం స్వర్ణలత

దేవరాపల్లి: క్రమశిక్షణతో కూడిన బోధన చేయడం ద్వారానే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని ప్రధానోపాధ్యాయిని వై. స్వర్ణలత అన్నారు. ఈ మేరకు ఎ. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యలోను పెంచడంలో భాగంగా అడ్మిషన్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని గ్రామంలో సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులతో గురువారం ఆమె చేపట్టారు. మూడేళ్లుగా తమ పాఠశాలలో పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతతోపాటు తమ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని తెలిపారు. తమ పాఠశాలలో ఎన్‌సీసీ, యోగా, మెడిటేషన్‌తోపాటు క్రీడలకు అత్యంత ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన పాఠశాల విద్యార్థిని టి. ఉషను హెచ్‌ఎం సహా ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ స్కాలర్ షిప్ ద్వారా 9 నుంచి 12వ తరగతి వరకు నాలుగేళ్లపాటు రూ.15 వేల చొప్పున నగదు అందుతుందని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



రోలుగుంటలో సిబ్బందితో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారి ధనలక్ష్మి

రోలుగుంట: మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా గురువారం కొవ్వూరులో హెల్త్ సూపర్‌వైజర్ వరహాలమ్మ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శి గొర్లి వరలక్ష్మి, తదితరులు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో దోమలను అరికడదాం–మలేరియా నుంచి విముక్తి పొందుదాం, దోమ తెరలు వాడండి.. దోమల నుంచి రక్షణ పొందాలి అంటూ.. నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ ప్రధానంగా నీటి నిల్వలు లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల ద్వారా సంభవించే మలేరియా జ్వరంతోపాటు డెంగ్యూ, చికెన్‌గున్యా తదితర రోగాలు గురించి తెలియజేశారు. మన వాడే నీటి పాత్రలు, వంటకాలపై విధిగా మూతలు పెట్టి భద్రపరచుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రాజ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

జీవాల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య మెలకువలు



మాట్లాడుతున్న పాడేరు డివిజన్ పశువైద్యశాఖ ఉప సంచాలకుడు నరసింహులు

మాడుగుల రూరల్: జీవాల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య మెలకువలపై పశువైద్యశాఖ పాడేరు డివిజన్ సహాయ సంచాలకుడు సిహెచ్. నర్సింహలు సారథ్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక అగ్రిల్యాబ్‌లో జరిగిన ఈ సదస్సులో చీడికాడ, మాడుగుల మండలాలకు చెందిన పశువైద్యాధికారులు, పారావెట్ సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహలు మాట్లాడుతూ జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో లింగ నిర్ధారిత వీర్యం, రైతు భరోసా కేంద్రాలు క్లస్టర్స్ గ్రేడింగ్, 1962 అంబులెన్స్ సేవలు, గొంతువాపు, వ్యాధి నిరోధిక టీకాలు, శాఖాపరమైన అంశాలు గురించి వివరించారు. వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు గురించి మాట్లాడారు. మాడుగుల ఏరియా పశువైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ వి. చిట్టినాయుడు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతకు వెలవెలబోయిన సంత



వేసవి ఎండతో కొనుగోలుదారులు లేక బోసిపోయిన వారపు సంత

కె.కోటపాడు: స్థానిక వారపు సంత వేసవి తాపానికి గురువారం వెలవెలబోయింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఎండ తీవ్రంగా ఉండటంతో కొనుగోలుదారుల తాకిడి తగ్గింది. దీంతో కూరగాయలు, పండ్లు, మసాల దినుసులు, వస్త్రాలు తదితర వస్తువులు విక్రయించే వ్యాపారులు కూడా అధిక వేడిని భరించలేక సమీపంలోని ఇళ్లు, దుకాణాల నీడన చేరారు. దీంతో దుకాణాలు వెలవెలబోయాయి. మధ్యాహ్నం 3.30 నుంచి ఎండ తీవ్రత తగ్గడంతో యథావిధిగా అమ్మకాలు సాగాయి.

9న ఉచిత వైద్య శిబిరం

అనకాపల్లి: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 9న స్థానిక గీతా ఆస్పత్రిలో ఉచిత ఎముకల పరీక్షలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భీశెట్టి రామకృష్ణ, యల్లపు సాంబశివరావులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 45 ఏళ్లు పైబడి, దీర్ఘకాలిక నడుంనొప్పి, కీళ్ల నొప్పులు, ఎముకలు తరుచుగా విరుగుట, మెనోపాజ్ వయసు దాటిన మహిళలు తదితర సమస్యలున్న వారి కోసం ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.